

శ్రీవాణి తరహాలోనే గరుడ ట్రస్టు

టీటీడీ శ్రీవాణి ట్రస్టు తరహాలో యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శ్రీగరుడ ట్రస్టును ఏర్పాటు చేశారు. - 8లో



ముగిసిన టెన్నిస్ పోటీలు

భువనగిరిలో కొనసాగుతున్న అండర్-18 జూనియర్స్ బాలబాలికల అంతర్జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు ముగిశాయి. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	586.70 అడుగులు
ఇన్‌ఫ్లో	:	2,50,487 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	2,50,487 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,373 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	8,529 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	4,881 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

మరో ఏఓ సస్పెన్షన్

నూతనకల్: తుంగతుర్తి మండల మహిళా ఏఈఓకు ఫోన్ చేసి అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలో మరో ఏఓపై కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సస్పెన్షన్ వేటువేశారు. ఇప్పటికే ఈ ఏఈఓతో అసభ్యంగా ప్రవర్తించిన తుంగతుర్తి ఏఓను కలెక్టర్ సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఇదే ఘటనలో బాధితురాలి ఫిర్యాదు మేరకు శనివారం నూతనకల్ మండల వ్యవసాయ అధికారి పి. మురళీబాబును సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

చిన్నారుల ఆరోగ్యం విషయంలో శ్రద్ధ ఉంచాలి



చిన్నారులతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్

చివ్వెంల(సూర్యాపేట) : చిన్నారుల ఆరోగ్యం విషయంలో బాలసదన్ నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూర్యాపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్ సూచించారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని బాల సదన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశీలించి, చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. చిన్నారులు క్రమ శిక్షణ పట్టుదలతో చదివి భావిభారతపౌరులుగా ఎదగాలన్నారు.

రూ.1.05కోట్లతో డిజిటల్ గ్రంథాలయంగా అభివృద్ధి



నేరేడుచర్లలోని శాఖా గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ వంగవీటి రామారావు


నేరేడుచర్ల : సూర్యాపేట పట్టణంలోని గ్రంథాలయాన్ని రూ.1.05కోట్లతో డిజిటల్ గ్రంథాలయంగా అభివృద్ధి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు వెల్లడించారు. శనివారం నేరేడుచర్లలోని గ్రంథాలయాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి భానోతు బాలమ్మతో కలిసి సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నేరేడుచర్లలో శిథిలావస్థకు చేరిన గ్రంథాలయం స్థలంలో అన్ని వసతులతో రూ.30లక్షలతో భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. గ్రంథాలయాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి, గ్రంథాలయ అధికారి కె. విజయభాస్కర్‌రెడ్డి, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొణతం చిన వెంకట్‌రెడ్డి, నూకల సందీప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేశ్‌రెడ్డి, డైరెక్టర్ మచ్చ శ్రీను, గ్రంథాలయ సిబ్బంది హుసెన్ తదితరులున్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ ఎన్జీ కళాశాలలో ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్ట్‌ల్లో బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు 2, వాణిజ్యశాస్త్రం 2, జంతుశాస్త్రం 1, ఆర్థికశాస్త్రం 1, కంప్యూటర్ సైన్స్ 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. ఆసక్తి గల అభ్యర్థులు సెప్టెంబర్ 2వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సాగర్‌కు వరద ఉధృతి

నాగార్జునసాగర్ : సాగర్ జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన గల శ్రీశైలం జలాశయం నుంచి 2,50,487 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా అంతే నీటిని సాగర్ నుంచి విడుదల చేస్తున్నారు. సాగర్ 26 గేట్ల ద్వారా స్పిల్‌వే మీదుగా 2,01,604 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా.. విద్యుదుత్పాదనతో 33,373 క్యూసెక్కులు వదులుతున్నారు. మొత్తం దిగువ కృష్ణానదిలోకి 2,34,977 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



26 గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు

ఏ పంట.. ఎన్ని ఎకరాలు

రేపటి నుంచి పంటల సర్వే

- సర్వే నంబర్ల వారీగా వివరాల నమోదు
- ప్రతి క్లస్టర్‌లో 2వేల ఎకరాల చొప్పున డిజిటల్.. మిగిలింది సాధారణ సర్వే చేసేలా ప్రణాళిక
- నవంబర్ 5న గ్రామ పంచాయతీల్లో తుది వివరాల ప్రదర్శన



నాగారం : పంటల సర్వేకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. వచ్చేనెల 1 నుంచి వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఏ రైతు ఎన్ని ఎకరాల్లో ఏయే పంటలు వేశాడో వివరాలు నమోదు చేయనున్నారు. ప్రతి క్లస్టర్ పరిధిలో రెండు వేల ఎకరాల చొప్పున డిజిటల్ విధానం, మిగితాది సాధారణ పద్ధతిలో సర్వే చేసేలా ప్రణాళిక రూపొందించారు. నవంబర్ 5న సర్వే వివరాలన్నీ పంచాయతీల్లో ప్రదర్శించనున్నారు.

కొన్ని గ్రామాల్లో డిజిటల్..
మరికొన్నింటిలో సాధారణ పద్ధతి..

జిల్లాలో సీజన్ల వారీగా ఏటా ప్రభుత్వం పంటల సమగ్ర సర్వే చేస్తుంది. వ్యవసాయ సిబ్బంది పంట పొలాలను సందర్శించకుండా, రైతులను అడిగి వివరాలు సేకరిస్తుండటంతో పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల సమయంలో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వేకు శ్రీకారం చుట్టింది. గతేడాది కొన్ని ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సర్వే చేశారు. డిజిటల్ సర్వే చేయాలంటే వ్యవసాయ విస్తరణాధికారులు తప్పనిసరిగా పంట పొలాన్ని సందర్శించాల్సి ఉంటుంది. రైతుల వారీగా ప్రతి సర్వే నంబర్‌ను సందర్శించడం కష్టం అవుతుందని నిరాకరించారు. చివరికి గతేడాది మాదిరిగానే ఈ సీజన్‌లోనూ ప్రయోగాత్మకంగా కొన్ని గ్రామాల్లో డిజిటల్ క్రాప్, మిగిలిన గ్రామాల్లో పాత పద్ధతిలోనే సర్వే చేయాలని ఆదేశాలు వచ్చాయి. ప్రతి క్లస్టర్‌లో 2 వేల ఎకరాల్లో డిజిటల్ క్రాప్ సర్వే చేయాలి. క్లస్టర్ పరిధిలో పురుష ఏఈఓలు 2 వేల ఎకరాలు, మహిళా ఏఈఓలు 1,800 ఎకరాల్లో సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

అక్టోబర్ 25నాటికి పూర్తి

అధికారులు సర్వే నంబర్ వారీగా పంట పొలాన్ని సందర్శించి, వివరాలను నమోదు చేయడంతో పాటు ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. రైతు పేరు, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ నమోదు చేయాలి. ఎన్ని ఎకరాల్లో పంట వేశారనే సమాచారం రైతుల మొబైల్‌కు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పంట లేకుంటే నో క్రాప్ అని నమోదు చేయాలి. ఈ ఏడాది అక్టోబరు25 నాటికి క్రాప్ సర్వే పూర్తి చేసి, 27న గ్రామ పంచాయతీల్లో వివరాలు ప్రదర్శించాల్సి ఉంది. పంటల నమోదులో తప్పులుంటే రైతులు.. ఏఈఓల దృష్టికి తీసుకెళ్లాలి. మార్పులు, చేర్పుల అనంతరం నవంబర్ 5వ తేదీన తుది జాబితాను ప్రదర్శిస్తారు.

నిర్దేశించిన గడువులోగా సర్వే పూర్తి చేస్తాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్దేశించిన గడువులోగా పంటల సర్వే పూర్తి చేస్తాం. నిబంధనల మేరకు సర్వే పూర్తి చేయాలని ఏఈఓలకు సూచించాం. సర్వేతో రైతులకు బహుళ ప్రయోజనం కలగనుంది.

– జి.శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, సూర్యాపేట.

6.17 ఎకరాల్లో సాగు భూమి

జిల్లాలో 6.17లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో వరి 4,85,125 ఎకరాలు, పత్తి 91వేల ఎకరాలు, కంది 2,650 ఎకరాలు, పెసర 2,700 ఎకరాలు, వేరుశనగ 400 ఎకరాలు, మొక్కజొన్న 45 ఎకరాలు, మిర్చి 15,150 ఎకరాలు, చెరకు 60 ఎకరాలు, ఆయిల్‌పామ్ 4,000 ఎకరాలు, ఇతర పంటలు 150 ఎకరాలు, పండ్లు, కూరగాయలు 16,200 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు.



నాగారంలో పంటల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు (ఫైల్)

తెగిన లోలెవల్ కల్వర్టు



హుజూర్‌నగర్ : బూరుగడ్డ పెద్ద చెరువు వద్ద లోలెవల్ కల్వర్టు తెగి పారుతున్న వరద

హుజూర్‌నగర్ : భారీ వర్షాలకు వాగులు పొంగి ప్రవహించడంతో శనివారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని బూరుగడ్డ పెద్ద చెరువు వద్ద లోలెవల్ కల్వర్టు అప్రోచ్ కొంత తెగిపోయింది. దీంతో గోపాలపురం, రాయిని గూడెం గ్రామాలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బూరుగడ్డ గ్రామానికి చెందిన రైతుల పొలాలన్నీ ఆవలి వైపు ఉండటం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెంటనే లోలెవల్ కల్వర్టు మరమ్మతు పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పథకాల అమలులో ఉద్యోగుల బాధ్యత కీలకం

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



అదనపు కలెక్టర్ రాంబాబును సన్మానిస్తున్న కలెక్టర్

భానుపురి (సూర్యాపేట) : ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఉద్యోగుల బాధ్యత అతి కీలకమని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు.అదనపు కలెక్టర్ రాంబాబు 1995లో డిప్యూటీ తహసీల్దార్ గా ప్రయాణం మొదలు పెట్టారన్నారు. ఏడేళ్లుగా అదనపు కలెక్టర్ గా నిబద్ధత తో విధులు నిర్వహిస్తూ లక్షలాది మంది ప్రజలకు సేవ చేయటం చాలా అభినందనీయమన్నారు. హుజూర్ నగర్ నుంచి సన్న బియ్యం పంపిణీ, తిరుమలగిరి నుంచి రేషన్ కార్డుల పంపిణీ లాంటి సంక్షేమ పథకాలు అదనపు కలెక్టర్ సహకారంతో జిల్లాలో విజయవంతం చేశామన్నారు. భూభారతి చట్టం అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా క్షేత్ర స్థాయి లో పర్యటనలు చేసి భూ సమస్యలు పరిష్కరించటంలో ఎంతగానో కృషి చేశారన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు వేణుమాధవ్, సూర్యనారాయణ, శ్రీనివాసులు, జెడ్పీసీఈఓ వివి అప్పారావు, జిల్లా అధికారులు, తహసీల్దార్ లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

యూరియా దొరుకుతలేదయా..



నెమ్మికల్ పీఏసీఎస్ వద్ద పట్టాదార్ పాస్ పుస్తకాలు పెట్టి బారులుదీరిన రైతులు

ఆత్మకూరు (ఎస్)(సూర్యాపేట) : వానా కాలం సీజన్‌లో పంటల సాగు పనులు ముగిసి యూరియా అవసరం ఏర్పడింది. ఈ యూరియా కోసం రైతులు నానా పాట్లు పడుతున్నారు. శనివారం ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్ పీఏసీఎస్ వద్ద సుమారు 200మందికిపైగా రైతులు పాస్‌బుక్‌లు పెట్టి బారులుదీరారు. 222 బస్తాల యూరియా రాగా ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. మిగతా రైతులు యూరియా అందక నిరాశతో వెనుదిరిగారు.

విద్యార్థుల అభివృద్ధే ధ్యేయం

చివ్వెంల(సూర్యాపేట) : విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా టీచర్లు పనిచేయాలని డీఈఓ అశోక్ సూచించారు. శనివారం చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామ శివారులోగల ఎంఎస్ఆర్ సెంట్రల్ స్కూల్‌లో జిల్లాలోని 18 పీఎంశ్రీ పాఠశాలల గణిత, భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు ఏ బుక్ ఆఫ్ డిజిటల్ లిటరసీ పై నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణలో డీఈఓ మాట్లాడారు. కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ జనార్దన్, డీఆర్‌పీలు వెంకన్న, జాఫర్, రవికుమార్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ అశోక్

సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది

- ఎస్పీ నరసింహా




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహా

సూర్యాపేటటౌన్ : యువత గంజాయి మత్తుకు బానిస కాకుండా సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్పీ కె.నరసింహ పేర్కొన్నారు. పాత నేరస్తులు, హిస్టరీ షీట్స్ కలిగిన వ్యక్తులు, గంజాయి కేసులో ఉన్న నిందితులకు చట్టాలపై సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం అవగాహన కల్పించారు. సమస్యలు సృష్టించే వారిని, నేరాలకు పాల్పడే వారిని, గంజాయి రవాణా, వినియోగం చేసే వారిని హెచ్చరించారు. అనంతరం మాట్లాడారు. అలవాటుగా అదే రకమైన నేరానికి పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. ఇలాంటి వ్యక్తులకు ముందస్తుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, ఆ తర్వాత బైండోవర్ చేస్తామన్నారు. పాతనేరస్తులు బైండోవర్ నిబంధనలకు కట్టుబడి ఉండాలన్నారు. ఈ సమావేశంలో సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐలు వెంకటయ్య, రాజశేఖర్, నాగేశ్వర్‌రావు, నరసింహారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు పాల్గొన్నారు.

కోదాడలో నకిలీ వైద్యుల బెడద

కేసులు నమోదు చేస్తున్నా బెదరని నకిలీలు

- ఇప్పటికే మూడు క్లినిక్‌లు సీజ్
- వైద్యుడి పేర అనుమతులు.. అనర్హుడితో వైద్య సేవలు
- రోగుల ప్రాణాలతో చెలగాటం
- అధికారుల పర్యవేక్షణలోపం



కోదాడ: కోదాడలో నకిలీ వైద్యుల బెడద రోజురోజుకు ఎక్కువ అవుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపం , ఒక వేళ నకిలీలను గుర్తించినా చర్యలు తీసుకోకపోవడంతో వారు రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. గతంలో పోలీసు కేసులు నమోదు చేసినా వీరు ఏమాత్రం తగ్గడం లేదు. తాజాగా శుక్రవారం అర్హత లేకుండా వైద్యం చేస్తున్న నకిలీ వైద్యుడి ఆస్పత్రిని జిల్లా వైద్యశాఖ అధికారులు సీజ్ చేశారు. ఈ హాస్పిటల్‌కు మూడునాలుగేళ్ల నుంచి అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్పా చర్యలు తీసుకోలేదనే విమర్శలున్నాయి. ఇలాంటి వైద్యశాలలు కోదాడలోనే మరో మూడు నాలుగు వరకు ఉన్నట్లు సమాచారం.

వైద్యుడి పేరుతో అనుమతి..
వైద్యం చేసేది మాత్రం నకిలీయే..

ఇతర దేశాలలో వైద్య విద్యను అభ్యసించిన వారు ఇండియన్ మెడికల్ కౌన్సిల్ నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్ తప్పని సరిగా పాస్ కావాలి. ఆ తరువాతే వారికి వైద్యం చేసే అర్హత వస్తుంది. కానీ పలువురు కఠినంగా ఉండే ఈ స్క్రీనింగ్ టెస్ట్ పాస్ కావడం లేదు. వీరు తెలివిగా ఇండియాలో చదివిన వైద్యుడి సర్టిఫికెట్లతో వైద్యశాలలకు అనుమతులు తీసుకుంటున్నారు. ఆ తరువాత వీరు రంగంలోకి దిగి అర్హత లేకున్నా వైద్యం చేస్తున్నారు. ఫిర్యాదులు వచ్చిన సమయంలో జిల్లా వైద్యశాఖ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్పా చర్యలు మాత్రం తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో మరో ముగ్గురు నకిలీ వైద్యులు క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మెడికల్ షాపులే క్లినిక్‌లుగా..

కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న పలు మెడికల్ షాపుల యజమానులు వారంలో రెండు మూడు రోజులు తమ దుకాణాలను క్లినిక్‌లుగా మారుస్తున్నారు. టెంట్లు వేసి జాతరను తలపించే విధంగా ఈ దందా సాగుతోంది. స్పెషలిస్ట్ డాక్టర్ పేర్లతో ఇక్కడ జరిగే దోపిడీకి అంతే లేదు. వచ్చిన వైద్యుడు అసలా.. నకిలీయా.. అతనా.. కాదా అన్నది చూడడంలేదు. సీనియర్ డాక్టర్ల పేరు చెప్పి జూనియర్లతో వైద్యం చేయిస్తున్నారనే విమర్శలున్నాయి. మూడు సంవత్సరాల క్రితం హుజూర్‌నగర్ రోడ్డులో ఓ మెడికల్ షాపు యజమాని స్కిన్ స్పెషలిస్ట్ స్థానంలో కోదాడకు చెందిన ఓ ఆర్ఎంపీ వైద్యుడిని కూర్చోబెట్టి వైద్యం చేయిస్తుండగా ఓ పేషంట్ గుర్తుపట్టి నిలదీయగా అతను పారిపోయాడు. నాడు ఈ షాపును అధికారులు సీజ్ చేశారు. నెల తిరగక ముందే మళ్లీ అనుమతులు ఇచ్చారు. తాజాగా మళ్లీ అక్కడ ఈ దందా సాగుతూనే ఉంది.

అర్హత లేకుండా వైద్యం చేస్తే క్రిమినల్ కేసులు

అర్హత లేకుండా వైద్యశాలలు నిర్వహించినా, వైద్యం చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తాం. ఫిర్యాదులు రావడంలో శుక్రవారం కోదాడలో ఓ వైద్యశాలను సీజ్ చేశాం. నకిలీ వైద్యులపై సరైన సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం. సమాచారం ఇచ్చినవారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.

–చంద్రశేఖర్, జిల్లా వైద్యాధికారి

బెయిల్‌పై వచ్చి మళ్లీ మరో చోట

ఇది.. కోదాడలో శ్రీహృదయ వైద్యశాల. దీన్ని నిర్వహిస్తున్నది వన్నా యశ్వంత్ కుమార్. ఎం.బి.బి.ఎస్. డీఎస్‌బీ చేసినట్లు బోర్డుపై రాసుకొని కోదాడలో వైద్యం చేస్తున్నాడు. ఇతను ఒక దగ్గర అనుమతి తీసుకొని వేరొక చోట వైద్యం చేస్తున్నాడని అధికారులు నోటీసులు ఇచ్చారు. అతనిపై ఫిర్యాదులు తరచూ రావడంతో వైద్యశాలను తనిఖీ చేయడంతో పాటు అతని వైద్యుడిగ్రీపై అనుమానం వచ్చి తనిఖీ చేయగా నకిలీదని తేలింది. ఇతడు తన పేరును పోలిన ఒక వైద్యుడి సర్టిఫికెట్లను ఎంసీఐ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసి అవి తన సర్టిఫికెట్లుగా నమ్మిస్తూ వైద్యశాలకు అనుమతులు పొంది వైద్యం చేస్తున్నాడు. అతను చూపుతున్న సర్టిఫికెట్లు కర్ణాటక రాష్ట్రం కోలార్‌లో గల శ్రీదేవరాజ్ మెడికల్ కళాశాలకు చెందిన యశ్వంత్‌కుమార్ తండ్రి రవికుమార్‌విగా అధికారులు గుర్తించారు. కోదాడలో వైద్యం చేస్తున్న యశ్వంత్‌కుమార్ ఉక్రెయిన్‌లో ఎంబీబీఎస్ చేసి ఇండియాలో మెడికల్ కౌన్సిల్ నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్ పాస్ కాలేదు. కానీ నకిలీ సర్టిఫికెట్లతో మూడేళ్లుగా కోదాడలో వైద్యశాల నిర్వహించాడు. ఇతనిపై అధికారులు కేసులు నమోదు చేయగా పోలీసులు అరెస్ట్ చేశారు. వెంటనే బెయిల్‌పై వచ్చి ప్రస్తుతం మరోచోట వైద్యం చేస్తున్నట్లు సమాచారం.



కోదాడలో ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేసిన అధికారులు(ఫైల్)

క్లుప్తంగా

తృటిలో తప్పిన ప్రమాదం

కొండమల్లేపల్లి: బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన కొండమల్లేపల్లిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీ ఆర్టీసీ మాచర్ల డిపోకు చెందిన బస్సు మాచర్ల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే క్రమంలో శనివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో కొండమల్లేపల్లి చౌరస్తాకు చేరుకోగానే బస్టాండ్ సమీపంలో డ్రైవర్ నిద్ర మత్తు వల్ల రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌పై ఎక్కి కొంత దూరం వరకువెళ్లింది. డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను ఢీకొట్టడంతో తేరుకున్న ఆర్టీసీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేసి బస్సును ఆపాడు. దీంతో బస్సులో ఉన్న సుమారు 20 మంది ప్రయాణికులు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

రోడ్డు ప్రమాదంలో సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మృతి


శ్రీను (ఫైల్)

చివ్వెంల : అతి వేగంగా వస్తున్న డీసీఎం అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో సీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం బీబీగూడెం గ్రామ శివారులోని సూర్యాపేట–ఖమ్మం రహదారిపై శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఆత్మకూర్(ఎస్) మండల ఏనుబాముల గ్రామానికి చెందిన కలకోట్ల శ్రీను (47) సీఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్‌గా అస్సాంలో పనిచేస్తున్నారు. ఇటీవలే సెలవులపై వచ్చిన ఆయన శనివారం సూర్యాపేటలో బంధువుల ఇంట్లో దశదిన కర్మకు హాజరై తిరిగి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో బీబీగూడెం గ్రామ శివారులో ఖమ్మం నుంచి సూర్యాపేటకు వస్తున్న డీసీఎం బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీను తలకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందారు. మృతుడి కుమారుడు రాకేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నిడమనూరు: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నిడమనూరు మండలం తుమ్మడంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తుమ్మడం గ్రామానికి చెందిన దుబ్బాకుల రమణారెడ్డి(46) గురువారం రాత్రి మద్యం మత్తులో తన అత్త మంగమ్మకు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకొంటానని చెప్పాడు. అనంతరం తన కిరాణ దుకాణంలోనే చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తమ్ముడు కోటిరెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు.

రామదూత వినాయక



చిట్యాల: చిట్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన అయోధ్య రామమందిరం తోపాటు రాముడి విగ్రహంతో కూడిన వినాయకుడి ప్రతిమ పలువురిని ఆకట్టుకుంటోంది. రామదూత హనుమంతుడిలా ఉన్న ఈ విగ్రహం వద్ద భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షకా.. కాగితపు గుజ్జు గణనాయక



మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడలోని గణేష్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కాగితపు గుజ్జు గణపయ్య విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది. ఉత్సవ కమిటీ సభ్యులు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా ప్రొద్దుటూరులో ప్రత్యేకంగా రకరకాల కాగితాలతో తయారు చేయించి తెచ్చారు. 16 అడుగుల ఎత్తుగల ఈ విగ్రహంతోపాటు రథాన్ని రూ.2.50లక్షలతో చేయించారు. మరో రూ.50 వేలు ఖర్చు చేసి గణేష్ మార్కెట్‌లో ప్రతిష్ఠించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే కాగితపు గుజ్జుతో తయారు చేసిన బొజ్జ గణపయ్య విగ్రహాన్ని తొలిసారిగా మిర్యాలగూడలోనే ప్రతిష్ఠించడం విశేషం.



ఆలయం కాదు.. మండపమే

కోదాడ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కోదాడ పట్టణంలోని 17వ వార్డు ఖమ్మం క్రాస్‌రోడ్డులో గల శ్రీనగర్ కాలనీలో ఎమ్మెల్యే పద్మావతి ఇంటి సమీపంలో భక్తులు భారీ సెట్టింగ్‌తో ఏర్పాటు చేసిన మండపం నిజమైన దేవాలయాన్ని తలపిస్తోంది. మండపం వద్ద విష్ణుమూర్తి పడుకొని ఉండగా అతడిపై నీరు పడే విధంగా ఫౌంటెయిన్ కూడా ఏర్పాటు చేశారు. రూ.7లక్షలకు పైగా ఖర్చు చేసి మందిరంలాంటి ఈ మండపాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ వార్డు మాజీ కౌన్సిలర్ బత్తినేని హనుమంతరావు తెలిపారు.






లక్ష్మీగణపతి నమోస్తుతే..

నల్లగొండ పట్టణంలోని సావర్కర్ నగర్‌లో త్రిశూల్ సేన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయకి దేవి అలంకరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం అబ్బురపరుస్తోంది. ఈ విగ్రహాన్నే వీరగణపతి, లక్ష్మీ గణపతి అని పిలుస్తారు. వినాయకి దేవి కథ గురించి ఇక్కడ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం మరో ప్రత్యేకత.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



నీలగిరిలో కేధార్‌నాథుడు

నల్లగొండ పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీకి చెందిన సత్యనారాయణ అనే భక్తుడు ఇరవై ఐదేళ్లుగా తన ఇంట్లో ప్రత్యేక అలంకరణతో భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటుచేస్తున్నారు. దీంట్లో భాగంగా ఈసారి కేథరీనాథుడి సెట్టింగ్‌తో విగ్రహం చేర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నాడు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

లక్కుంటే.. పట్టుచీర



భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లిలోని కొండాలక్ష్మణ్ బాపూజీ వీవర్స్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో భక్తులను ఆకర్షించేందుకు నిర్వాహకులు లక్కీడ్రా కూపన్లు పెట్టారు. రూ.100 చెల్లించి కూపన్ తీసుకొంటే గణేష్ నిమజ్జనం రోజున లక్కీ డ్రా ద్వారా మొదటి బహుమతి కింద రూ.22వేల పోచంపల్లి ఇక్కత్ పట్టుచీర, రెండవ బహుమతి రూ.15వేల పట్టుచీర, మూడవ బహుమతి రూ.7,800 పట్టుచీరతో పాటు మరో 20 మందికి రూ.2వేల విలువ చేసే మస్‌రైజ్డ్ చీరలను అందజేస్తామని ఏకేఎల్‌బీ వీవర్స్ మార్కెట్ అధ్యక్షుడు గుండు శ్రీరాములు తెలిపారు.



చదువుల సన్నిధిలా..

అర్వపల్లి: గణేష్ నవరాత్రి ఉత్సవాలు వచ్చాయంటే చాలు పిల్లల హడావుడి చెప్పతరం కాదు. పాఠశాలలకు వెళ్లివచ్చి సాయంత్రం నుంచి రాత్రి వరకు గణేశుడి మండపాల వద్దే గడుపుతుంటారు. అర్వపల్లిలోని తుంగతుర్తి రోడ్డులో ఏర్పాటు చేసిన మండపంలోని శనివారం రాత్రి కొందరు పిల్లలు గణేశుడి సన్నిధిలో ఇలా హోంవర్క్ చేసుకుంటూ కాపలాగా ఉన్నారు.



కుక్కకు మత్తు మందు ఇచ్చి ఇంట్లో చోరీ

గరిడేపల్లి : మండల పరిధిలోని ఎల్బీనగర్ గ్రామంలోని ఓ ఇంట్లో శనివారం రాత్రి కుక్కకు మత్తు మందు ఇచ్చిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. గరిడేపల్లి ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్‌కు చెందిన వల్లభనేని శ్రీనివాసరావు ఆస్పత్రిలో చూపించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి విజయవాడ వెళ్లారు. ఆదివారం ఉదయం పని మనిషి శ్రీనివాసరావు ఇంటి వద్దకు వెళ్లగా తలుపులు తీసి ఉండడం.. ఇంట్లోని బీరువా తలుపులు తెరిచి ఉండడంతో పక్కనే ఉన్న వారికి తెలియజేశారు. ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు తెలపడంతో గరిడేపల్లి ఎస్ఐ చలికంటి నరేష్ తన సిబ్బందితో శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి పరిశీలించారు. స్థానికులు ఫోన్ ద్వారా శ్రీనివాసరావుకు తెలపగా ఇంట్లో కొంత నగదు, బంగారం ఉన్నట్లు తెలిసింది. శ్రీనివాసరావు ఇంట్లో కుక్క ఉన్నప్పటికీ దానికి మత్తుమందు ఇచ్చి దొంగతనానికి పాల్పడడం పలు అనుమానాలకు తావిస్తోంది. తెలిసిన వారే ఈ చోరీకి పాల్పడి ఉండొచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


ఇంట్లో తెరిచి ఉన్న బీరువా

శ్రీవాణి తరహాలోనే గరుడ ట్రస్టు

- ట్రస్టు ద్వారా వచ్చిన సొమ్ము విద్య, వైద్యం, ప్రసాద వితరణకు వినియోగం
- దాతలకు ప్రత్యేక దర్శన భాగ్యం
- విధివిధానాలు విడుదల చేసిన ఆలయ ఈఓ

యాదగిరిగుట్ట: తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తుల కోసం శ్రీవాణి ట్రస్టును ఏర్పాటు చేసిన విధంగానే యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం శ్రీగరుడ ట్రస్టును ఏర్పాటు చేశారు. అందుకు సంబంధించిన విధి విధానాలను శనివారం ఆలయ ఈఓ వెంకట్రావు వెల్లడించారు. గరుడ స్కీంకు వచ్చే విరాళాలను గరుడ ట్రస్టు పేరుతో అకౌంట్ ప్రారంభించి విద్య, వైద్యం, ప్రసాద వితరణ నిర్వహణకు వినియోగించనున్నారు. ఈ ట్రస్టును ఈ నెల 15న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంభించగా.. 29వ తేదీన విధి విధానాలను రెవెన్యూ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ పరిశీలించి విడుదల చేశారు.

మూడు స్లాట్లు.. ప్రత్యేక కూపన్లు..

గరుడ ట్రస్టును మూడు స్లాట్లుగా ఏర్పాటు చేశారు.



శ్రీ గరుడ ట్రస్టు స్లాట్‌లకు సంబంధించిన ఫ్లెక్సీ

విరాళాలుగా చెల్లించిన భక్తులకు వసతి కూపన్స్, దర్శనం కూపన్స్ అందజేసి దర్శన సదుపాయాలను కల్పించడంతో పాటు బాండ్ సైతం అందజేయనున్నారు. గరుడ స్కీంలో విరాళాలు సమర్పించే భక్తులు దేవస్థానం సెల్‌లో విరాళాలు సమర్పించి బాండ్, కూపన్స్‌ను పొందాలని ఆలయాధికారులు సూచిస్తున్నారు.

స్కీం వివరాలు ఇలా..

- రూ.50వేలు విరాళం చెల్లించిన భక్తులకు రూ.300 బ్రేక్ దర్శనాన్ని సంవత్సరంలో రెండు సార్లు ఆరుగురు చొప్పున లైఫ్‌టైమ్ ఇవ్వనున్నారు. రూ.150 ప్రత్యేక దర్శనం టిక్కెట్‌పై సంవత్సరంలో రెండు సార్లు ఆరుగురికి లైఫ్ టైమ్ ఉంటుంది. విరాళం చెల్లించిన మొదటిసారి శ్రీస్వామి వారి అభిషేకం లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం (కల్యాణ శెల్లా, కనుము) అందజేస్తారు.
- రూ.లక్ష విరాళం చెల్లించిన భక్తులకు రూ.300 బ్రేక్ దర్శనాన్ని సంవత్సరంలో నాలుగు సార్లు ఆరుగురు చొప్పున లైఫ్‌టైమ్ ఇవ్వనున్నారు. రూ.150 ప్రత్యేక దర్శనం టిక్కెట్ పై సంవత్సరంలో నాలుగు సార్లు ఆరుగురు చొప్పున లైఫ్‌టైమ్ ఉంటుంది. విరాళం చెల్లించిన మొదటి సారి శ్రీస్వామి వారి అభిషేకం లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం అందజేస్తారు.
- రూ.2లక్షల విరాళం చెల్లించిన భక్తులకు రూ.300 బ్రేక్ దర్శనాన్ని సంవత్సరంలో మూడు సార్లు ఎనిమిది మంది చొప్పున లైఫ్‌టైమ్ ఇవ్వనున్నారు. రూ.150 ప్రత్యేక దర్శనం టిక్కెట్ పై సంవత్సరంలో 8 సార్లు ఆరుగురికి దర్శనం ఉంటుంది. అంతే కాకుండా కొండ కింద యాదరుషి నిలయంలో డబుల్ బెడ్‌రూం గదిని సైతం కేటాయిస్తారు. వీటితో పాటు విరాళం చెల్లించిన మొదటి సారి శ్రీస్వామి వారి అభిషేకం లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం బహూకరిస్తారు.

కల్తీదాణా తయారు చేస్తున్న ఇద్దరి అరెస్ట్


కేతేపల్లిలో కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ కొండల్‌రెడ్డి, చిత్రంలో నిందితులు

కేతేపల్లి: కల్తీ దాణాను తయారు చేసి కోళ్ల ఫామ్స్ యజమానులకు విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను శనివారం కేతేపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించి వివరాలను శనివారం కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి వెల్లడించారు. కేతేపల్లి మండలం చీకటిగూడెం గ్రామానికి చెందిన ఆల్దాసు సతీష్, బుద్దె కృష్ణలు సూర్యాపేట పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లోని రైస్ మిల్లుల నుంచి నూకలు, తవుడు సేకరించి కోళ్ల ఫారాలకు దాణాను విక్రయిస్తున్నారు. వ్యాపార నిర్వహణ కోసం కేతేపల్లిలోని పడావుగా ఉన్న పాత రైస్‌మిల్ గోదామును కిరాయికి తీసుకున్నారు. అయితే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో నూకలు, తవుడుతో కూడిన దాణాలో 30శాతం ఇసుకను కలిపి కల్తీ దాణాను తయారు చేసే దందాకు తెరలేపారు. తయారు చేసిన కల్తీ దాణాను డీసీఎంలో లోడ్ చేసి ఎలాంటి అనుమతులు లేకుండానే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని కోళ్ల ఫారాల యజమానులకు అధిక ధరలకు విక్రయిస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. కోళ్ల కల్తీ దాణా తయారీ దందాపై స్థానిక పంచాయతీ కార్యదర్శి సయ్యద్ బాబా చేసిన ఫిర్యాదు మేరకు కేతేపల్లి ఎస్ఐ సతీష్ శనివారం తన సిబ్బందితో కలిసి గోదాముపై దాడి చేశారు. తనిఖీలో గోదాములో నిల్వ ఉన్న రూ.3.30 లక్షల విలువైన 245 బ్యాగుల కల్తీ కోళ్ల దాణా (122.5 క్వింటాళ్లు), 8 టన్నుల ఇసుకను పోలీసులు సీజ్ చేశారు. ఈ దాణా తిన్న కోళ్లతోపాటు వాటిని తిన్న మనుషుల ఆరోగ్యాలకు కూడా ముప్పు పొంచి ఉందని సీఐ తెలిపారు. విచారణ అనంతరం కల్తీ దాణా తయారు చేస్తున్న సతీష్, కృష్ణలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు. వారినుంచి డీసీఎం, టాటా నెక్సాన్ కారు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. సమావేశంలో కేతేపల్లి ఎస్ఐ యు.సతీష్, సిబ్బంది అనిల్‌రెడ్డి, సతీష్, సైదులు, రాంబాబు పాల్గొన్నారు.

పత్తి మిల్లు ఆస్తులు సీజ్

పెద్దవూర: మండల కేంద్రంలోని భోగమలో ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ స్పిన్నింగ్ మిల్లు ఆస్తులను సీజ్ చేసినట్లు నాగార్జునసాగర్ సర్కిల్ సీఐ శ్రీనునాయక్ శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని విశ్వనాథ్ స్పిన్నింగ్ మిల్లును నిర్వాహకులు భోగమలో ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం సారబ్ ప్రతానికి 8 ఏళ్లకు గాను లీజుకు ఇచ్చారు. స్పిన్నింగ్ మిల్లుకు కావాల్సిన రా మెటీరియల్ పంపిణీకి గజ్వేల్‌కు చెందిన తిరుమల ఎంటర్ ప్రైజెస్ నిర్వాహకుడు బుక్క రమేష్‌కు భోగమలో ఎంటర్ ప్రైజెస్‌కు 2025 జూన్ 30న ముంబైలో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో తిరుమల ద్వారా గత నెల జూలైలో రూ.2,20,64,000 రా మెటీరియల్‌ను పంపించింది. వీనికి సంబంధించి డబ్బులు భోగమలో చెల్లించలేదు. తమకు బిల్లు చెల్లించకపోగా ఈనెల 17న మూడు లారీల పత్తి దారాలను అమ్ముకున్నట్లు తిరుమల నిర్వాహకుడు రమేష్ పిటీషన్ ఇచ్చారు. ఆయా యాజమాన్యాలపై ఛీటింగ్ కేసు నమోదు చేసి ఆస్తులు సీజ్ చేసి కోర్టుకు అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు.

మూసీలో చిక్కుకున్న యువకుడు సురక్షితం

- రాత్రంతా నదిలోనే మట్టిదిబ్బపై ఉన్న బాధితుడు మత్స్యగిరి
- శనివారం తెల్లవారుజామున ఒడ్డుకు చేర్చిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం


నదిలో చిక్కుకున్న మత్స్యగిరిని ఒడ్డుకు తీసుకొస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు

రామన్నపేట : ప్రమాదవశాత్తు మూసీనదిలో పడి వరద ప్రవాహంలో చిక్కుకున్న యువకుడు కానుకుంట్ల మత్స్యగిరిని ఎస్‌డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బంది శనివారం ఉదయం సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన మత్స్యగిరి శుక్రవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో గ్రామం సమీపంలోని మూసీ వంతెనపై నుంచి ప్రమాదవశాత్తు మూసీనదిలో పడిపోయాడు. వరద ప్రవాహానికి సుమారు మూడువందల మీటర్ల దూరం వరకు కొట్టుకుపోయాడు. అదృష్ట వశాత్తు చెట్టును ఆసరా చేసుకొని పెద్ద మట్టిదిబ్బపైకి చేరాడు. అక్కడ ఉన్న వారు గమనించి వెంటనే పోలీసు, రెవెన్యూ, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. తహసీల్దార్ లాల్ బహదూర్‌శాస్త్రి, సీఐ ఎన్.వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకొని ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు యాదగిరిగుట్ట నుంచి ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని రప్పించారు. యువకుడిని రక్షించేందుకు నదిలోకి పడవలో వెళ్లిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందంలోని ఒక సభ్యుడు నదిలో పడిపోగా మిగిలిన సభ్యులు అతడిని చాకచక్యంగా రక్షించారు. అనంతరం ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు మత్స్యగిరి ఉన్న ప్రదేశానికి చేరుకోవడానికి విశ్వ ప్రయత్నం చేశారు. చీకటిగా ఉండడం, నది ప్రవాహం ఉధృతంగా పారుతుండడంతో అతడి వద్దకు చేరుకోలేక పోయారు. రాత్రి 12 గంటల తరువాత సహాయక చర్యలు నిలిపివేశారు.

రాత్రంతా వంతెనపైనే కాపాలా..

మత్స్యగిరికి వెలుతురు కనిపించేలా అధికారులు అర్ధరాత్రి ట్రాక్టర్ లైట్లు ఏర్పాటు చేశారు. కుటుంబసభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక యువకులు వంతెనపైనే రాత్రంగా అతడిని గమనిస్తూ కాపాలా కాశారు. స్థానిక గ్రామ పంచాయతీ భవనంలోనే సేదదీరిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం శనివారం తెల్లవారుజామున 5గంటలకే సహాయక చర్యలను మొదలు పెట్టారు. ఉదయం 6:45 గంటలకు మత్స్యగిరిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. దీంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రాణాలను పణంగా పెట్టి మత్స్యగిరిని కాపాడిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులను గ్రామస్తులు, అధికారులు అభినందించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ హనుమంతరావు రాత్రంతా సహాయక చర్యలను పర్యవేక్షించారు. బయటకు వచ్చిన మత్స్యగిరి కలెక్టర్ ఫోన్‌లో పరామర్శించారు. ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, డీఎఫ్ఓ మధుసూదన్ రావు, ఎస్ఎఫ్ఓ మధుసూదన్‌రెడ్డిలు సహాయక చర్యలను పర్యవేక్షించారు. సీఐ ఎన్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐలు డి.నాగరాజు, యుగంధర్‌లు సహాయక చర్యలకు ఆటంకం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముగిసిన అంతర్జాతీయ టెన్నిస్ పోటీలు

భువనగిరి : భువనగిరి పట్టణంలోని సువాలి ఎస్టేట్‌లో గల న్యూ డైమెన్షన్ స్కూల్ ఆవరణంలో కొనసాగుతున్న అండర్–18 జూనియర్స్ బాలబాలికల అంతర్జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు శనివారం ముగిశాయి. వివిధ దేశాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఆరు రోజుల పాటు పోటీల్లో పాల్గొని సందడి చేశారు. ముగింపు రోజున జరిగిన ఫైనల్స్‌లో గెలుపొందిన వారికి మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టెన్నిస్ అకాడమీ ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, తెలంగాణ స్టేట్ టెన్నిస్ అసోసియేషన్ మేనేజర్ వైభవ్ పటేల్, ,జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు సద్ది వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు దిడ్డి బాలాజీ, ప్రధాన కార్యదర్శి కలీం అహ్మద్, సంయుక్త కార్యదర్శి పరమేష్‌కుమార్, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

విజేతలు ఎవరంటే..

బాలుర సింగిల్స్ ఫైనల్‌లో వ్రజ్ గోహిల్(ఇండియా), దెవ్ విపుల్ పటేల్ (ఇండియా)పై 6-1, 6-4 తేడాతో విజయం సాధించింది. బాలికల విభాగంలో స్నిగ్దకాంత (ఇండియా), ఐశ్వర్య జాదవ్(ఇండియా)పై 5-7, 6-2,6-0 గెలుపొందింది.



విజేతలకు మెమొంటోలు అందజేస్తున్న నిర్వాహకులు


టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారిణి

బాలుర డబుల్స్ ఫైనల్‌లో థామస్, కాప్పి (ఫ్రాన్స్), ప్రణవ్ మహేష్ సరవణకుమార్ (ఇండియా)లు, హృథిక్ కాటకం(ఇండియా), ప్రకాష్ సారణ్(ఇండియా)పై 6-4, 6-0తేడాతో విజయం సాధించారు. బాలికల విభాగంలో నైనికా నరేందర్ రెడ్డి బేంద్రం(ఇండియా), స్నిగ్ద కాంత(ఇండియా)లు, శ్రీనిత్తి చౌదరి(ఇండియా), హర్షకార్తిక ఊరగంటి(ఇండియా)పై 5-1 తేడాతో రిటైర్డ్ మ్యాచ్‌లో విజయం సాధించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

అనంతగిరి: మూడు రోజుల క్రితం పాలేరు వాగులో గల్లంతైన కోదాడ మండలం గోండ్రియాలకు చెందిన యువకుడు కిన్నెర ఉపేందర్ (28) మృతదేహం శనివారం ఉదయం గ్రామానికి కిలోమీటర్ దూరంలో లభ్యమైంది. ఇతడి కోసం మూడు రోజులుగా అనంతగిరి, కోదాడ రూరల్ పోలీసులతో పాటు అగ్నిమాపకశాఖ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపడుతూ వచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అనంతగిరి పోలీసులు కోదాడలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.